



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 205 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
శనివారం 01 మార్చి 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# ఏసీ గదుల్లో కూర్చుంటే ప్రజల కష్టాలు తెలియవు: చంద్రబాబు

**ఏసీ గదుల్లో కూర్చుంటే పేదల సమస్యలు, కష్టాలు తెలియవని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.**

**చిత్తూరు, మార్చి 1, (రిపబ్లిక్ న్యూస్):** ఏసీ గదుల్లో కూర్చుంటే పేదల సమస్యలు, కష్టాలు తెలియవని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. క్షేత్రస్థాయిలో తిరిగితేనే అధికారులకు ప్రజల బాధలు తెలుస్తాయన్నారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు పర్యటనలో భాగంగా అక్కడ నిర్వహించిన ప్రజావేదిక సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా గత వైకాపా పాలనలో విమర్శలు గుప్పించారు. "గత ఐదేళ్ల పాటు జనం ఎన్నో బాధలు పడ్డారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో విధ్వంసం సృష్టించింది. ఆ దారుణాలను ప్రజలు వెంటనే తెలుసుకుని కూటమి ప్రభుత్వాన్ని తీసుకొచ్చారు" అని తెలిపారు. "ఇప్పుడు ఎక్కడ చూసినా ప్రజల ముఖాల్లో ఆనందం కన్పిస్తోంది. మేం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తున్నాం.



ప్రతినెలా ఒకటోతేదీనే ఇంటికెళ్లి పింఛన్లు ఇస్తున్నాం. రాష్ట్రంలో 64 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నాం. దివ్యాంగుల పింఛన్లను రూ.6వేలకు పెంచాం. కిడ్నీ, తలసీమియా రోగులకు రూ.10వేలు ఇస్తున్నాం. తీవ్ర వ్యాధులతో కదల్లేని వారికి రూ.15వేలు ఇస్తున్నాం. పింఛన్ల కోసం ఏటా రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం.

### ప్రజలు మెచ్చుకునేలా మెరుగైన పాలన

సంపద ఎలా సృష్టించాలి అనేదానిపై నిత్యం ఆలోచిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే 12.9 శాతం వృద్ధిరేటు సాధించాం. కేంద్రంతో కలిసి చేసే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చి పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తున్నాం. నాగరిక ప్రపంచంలో పారిశుద్ధ్యం చాలా అవసరం. మరో 2 నెలల్లో రోడ్లపై గుంతలు పూడ్చడం పూర్తవుతుంది. రద్దీ ప్రాంతాల్లో నాలుగు వరుసల్లో కొత్త రోడ్లు వేస్తున్నాం. అమరావతిని మళ్లీ పట్టాలెక్కించాం. పోలవరం నిర్మాణాన్ని వేగవంతం చేశాం. ప్రజలు మెచ్చుకునేలా మెరుగైన పరిపాలన అందిస్తాం.

### ఆర్థిక సాయం చేసే వీలుంటేనే హామీ ఇస్తాం..

జూన్లోగా డీఎస్సీ భర్తీ ప్రక్రియ పూర్తిచేస్తాం. అవసరమైన చోట్ల అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తాం. మీ భూముల పత్రాలపై రాజముద్ర ఉండాలని కానీ.. నేతల ఫొటోలు కాదు. 'తల్లికి వందనం' పేరుతో ఒక్కొక్కరికీ రూ.15వేలు అందజేస్తాం. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ అందిస్తాం. మే నెలలో ఆ నిధుల విడుదల చేస్తాం. త్వరలోనే రైతులకు, మత్స్యకారులకు రూ.20వేల ఆర్థిక సాయం అందజేస్తాం. ఆర్థిక సాయం చేసే వీలుంటేనే హామీ ఇస్తాం.. లేకుంటే మాయమాటలు చెప్పను" అని సీఎం అన్నారు.

# మణిపుర్ పరిస్థితులపై సమీక్ష.. అమిత్ షా కీలక ఆదేశాలు

**మార్చి 8 నుంచి మణిపుర్లోని అన్ని మార్గాల్లో ప్రజల రాకపోకలు స్వేచ్ఛాయుతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదేశాలు జారీ చేశారు.**

**దిల్లీ, మార్చి 1, (రిపబ్లిక్ న్యూస్):** గత రెండేళ్లుగా జాతుల మధ్య వైరంతో అల్లకల్లోలంగా మారిన మణిపుర్ రాష్ట్రపతి పాలన కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలోని భద్రతా పరిస్థితులపై ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి.. కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా మార్చి 8 నుంచి రాష్ట్రంలోని అన్ని మార్గాల్లో ప్రజల రాకపోకలు స్వేచ్ఛాయుతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.




అడ్డంకులు సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. హింసతో రగిలిపోతున్న ఈశాన్య రాష్ట్రంలో సాధారణ స్థితిని పునరుద్ధరించడంపై అమిత్ షా అధికారులతో చర్చలు జరిపినట్లు సమాచారం. ఢిల్లీలో నిర్వహించిన ఈ సమావేశంలో మణిపుర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆర్మీ, పారామిలటరీ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత అక్కడి పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి. దాదాపు రెండేళ్లుగా జాతుల మధ్య వైరంతో రగులుతున్న మణిపుర్లో కల్లోల పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన కేంద్ర ప్రభుత్వం అధికారాలన్నింటినీ అక్కడి గవర్నర్కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తమ వద్ద ఉన్న అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను ఏడు రోజుల్లోగా అప్పగించాలని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు గవర్నర్ అజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఏడు రోజులలో దాదాపు 300 ఆయుధాలను ప్రజలు ప్రభుత్వానికి అప్పగించినట్లు సమాచారం.

# స్క్రిప్ట్ ఎవరిచ్చినా.. అనుభవించేది పోసానే: హోం మంత్రి అనిత

**తప్పు చేస్తే ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని ఏపీ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు.**

**అనంతపురం, మార్చి 1, (రిపబ్లిక్ న్యూస్):** తప్పు చేస్తే ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని ఏపీ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని పేర్కొన్నారు. అనంతపురంలో జరిగిన ఎస్సైల పాసింగ్ అవుట్ పరేడ్కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరేడ్ ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు.



"వైకాపా నేత, నటుడు పోసాని కృష్ణమురళి గతంలో అత్యంత దారుణంగా మాట్లాడినందుకే కేసులు నమోదు అయ్యాయి. రాష్ట్రంలో పోసాని మాటలను సమర్థించే వాళ్ళు ఒక్కరైనా ఉన్నారా? అంతర్యుద్ధం గురించి మాట్లాడే గోరంట్ల మాధవ్.. తమ పార్టీలో జరుగుతున్న అంతర్యుద్ధం గురించి ముందు ఆలోచించాలి. ఇప్పటికైనా నోటిని అదుపులో పెట్టుకోవాలని గోరంట్ల మాధవ్ను హెచ్చరిస్తున్నా. నోటికొచ్చినట్టు మాట్లాడతాం అంటే కుదరదు. ఇక్కడ ఉన్నది వైకాపా ప్రభుత్వం కాదు.. కూటమి ప్రభుత్వం. ఏది పడితే అది మాట్లాడటం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు. రెడ్ బుక్ ప్రకారం మేం ముందుకెళ్తే వైకాపా నేతలెవరూ రోడ్లపై తిరగలేరు. పోసానిపై రాష్ట్రవ్యాప్తంగా 17 కేసులు ఉన్నాయి. కక్షపూరిత రాజకీయాలు చేయడం లేదు. అలా అని తప్పు చేసిన వాళ్లని ఉపేక్షించేది లేదు. చేసిన తప్పులకు శిక్ష నుంచి ఎవరూ తప్పించుకోలేరు. పోసానికి స్క్రిప్ట్ ఎవరిచ్చినా.... అనుభవించేది ఆయనే. గత వైకాపా ప్రభుత్వం పోలీసులకు రూ.900 కోట్లు బకాయిలు పెట్టి వెళ్లింది. కూటమి అధికారంలోకి వచ్చాక దాదాపు రూ.250 కోట్ల బకాయిలు చెల్లించాం. అమరావతిలో ఉండన్న ఒకే ఒక కారణంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఫోరెన్సిక్ ల్యాబ్ నిర్మాణాన్ని గోడలకే పరిమితం చేసింది గత ప్రభుత్వం. గత ప్రభుత్వ పాపాలను ఒక్కొక్కటిగా సరిచేస్తూ వస్తున్నాం. హోం శాఖలో సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే. త్వరలోనే నియామకాలు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూస్తాం" అని మంత్రి అనిత పేర్కొన్నారు.

### గల్లంతైన వారి ఆచూకీ మరికొద్ది గంటల్లో..

# ఎస్ఎల్బీసీ సహాయక చర్యలపై మంత్రి జూపల్లి

**ఎస్ఎల్బీసీ సొరంగం వద్ద జరుగుతున్న సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.**

**దోమలపెంట, మార్చి 1, (రిపబ్లిక్ న్యూస్):** ఎస్ఎల్బీసీ సొరంగం వద్ద జరుగుతున్న సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గల్లంతైన వారి ఆచూకీ మరికొద్ది గంటల్లో లభించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. టన్నెల్ వద్ద సహాయక చర్యలను పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. టన్నెల్లో మనుషులు ఉన్నట్లు ఆనవాళ్లు కన్పించిన చోట తవ్వకాలు జరుగుతున్నట్లు తెలిపారు. "5-8 మీటర్ల మట్టిదిబ్బ కింద నలుగురి ఆనవాళ్లు ఉన్నట్లు స్కానింగ్లో కన్పించాయి.



మరో నలుగురు సిబ్బంది టన్నెల్ బోరింగ్ మిషన్ కింద ఉన్నట్లు తెలుస్తోంది. సహాయక చర్యల్లో మొత్తం 11 విభాగాల వాళ్లు పనిచేస్తున్నారు. పనులు వేగంగా జరగటం లేదని విమర్శిస్తున్నారు. లోపల పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో వారికి తెలియట్లేదు. విమర్శించే వారు లోపలికి వెళ్లి చూస్తే పరిస్థితి అర్థమవుతుంది. కాళేశ్వరంలో 200 కిలోమీటర్ల సొరంగం తవ్వామని భారాస నేత హరీశ్ రావు అన్నారు. మరి పదేళ్లలో ఎస్ఎల్బీసీలో 20 కిలోమీటర్ల టన్నెల్ ఎందుకు తవ్వలేదు? గత పదేళ్లలోనే దీన్ని పూర్తి చేసి ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదేమో" అని మంత్రి జూపల్లి తెలిపారు.

### భాజపా-కాంగ్రెస్ శ్రేణుల మధ్య తోపులాట..

# మామునూర్ విమానాశ్రయం వద్ద ఉద్రిక్తత

**వరంగల్ జిల్లాలోని మామునూర్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భాజపా-కాంగ్రెస్ శ్రేణులు ఘర్షణకు దిగారు. వారి మధ్య తోపులాట జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.**

**మామునూర్, మార్చి 1, (రిపబ్లిక్ న్యూస్):** వరంగల్ జిల్లాలోని మామునూర్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భాజపా-కాంగ్రెస్ శ్రేణులు ఘర్షణకు దిగారు. వారి మధ్య తోపులాట జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మామూనూర్ విమానాశ్రయ పనులకు ఇటీవల కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్రం అనుమతి ఇవ్వడంతో ప్రధాని మోదీకి పూలాభిషేకం చేసేందుకు భాజపా శ్రేణులు అక్కడకి వచ్చారు.



అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా రావడంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను అక్కడినుంచి పంపించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా విమానాశ్రయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మామునూరు ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్కు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 150 కి.మీ పరిధిలో మరో విమానాశ్రయం ఉండకూడదని గతంలో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. జీఎంఆర్తో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. దీంతో మామునూరుకు జీఎంఆర్ అంగీకారం తెలిపింది. ఈ క్రమంలోనే విమానాశ్రయం అభివృద్ధి పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని ఎయిర్పోర్ట్ అథారిటీని రామ్మోహన్ నాయుడు ఆదేశించారు.

### జీడీ నెల్లూరులో సీఎం చంద్రబాబు పర్యటన..

# స్వయంగా పింఛన్ల పంపిణీ

**చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన కొనసాగుతోంది.**



**జీడీ నెల్లూరు, మార్చి 1, (రిపబ్లిక్ న్యూస్):** చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన కొనసాగుతోంది. జీడీ నెల్లూరులో సీఎం స్వయంగా లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. స్థానికులను పలకరించి పలువురితో సెల్ఫీలు దిగారు. దీనిలో భాగంగా ఓ మహిళకు పింఛను అందించిన సీఎం.. ఆమె కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆ ఇంట్లో ఉన్న ఇద్దరు ఆడపిల్లలకు రూ.2 లక్షల చొప్పున ఎఫ్‌డి చేయాలని, వారిని సంక్షేమ పాఠశాలలో చదివించాలని అధికారులను ఆదేశించారు. సదరు మహిళ కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని అధికారులకు చెప్పారు.

### పోసాని కృష్ణమురళికి స్వల్ప అస్వస్థత

**రాజంపేట, మార్చి 1, (రిపబ్లిక్ న్యూస్):** అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్జైలులో ఉన్న వైకాపా నేత, సినీనటుడు పోసాని కృష్ణమురళి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో ఆయన్ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



# రేవంత్ రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**అబద్ధాలు చెప్పినంత మాత్రాన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత తగ్గదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.**

**హైదరాబాద్, మార్చి 1, (రిపబ్లిక్ న్యూస్):** అబద్ధాలు చెప్పినంత మాత్రాన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత తగ్గదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇవ్వడంలో ఒక విధానం ఉంటుంది. తెలంగాణలో కేంద్రం చేపట్టిన రూ.10లక్షల కోట్ల విలువైన పనులను ఇప్పటికే వివరించాం. నేను ఇతర కేంద్ర మంత్రులను బెదిరించానని దిగజారుడు మాటలు మాట్లాడారు. కేంద్ర పథకాలను సమర్థంగా అమలు చేయాలని సీఎంలకు ఎన్నో లేఖలు రాశాను. సీఎంలతో సంబంధం లేకుండా రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే వ్యక్తిని. దేశంలో నిర్మించే 7 టెక్స్టైల్ పార్కుల్లో ఒకటి తెలంగాణకు తెచ్చాను. రాష్ట్రానికి ఆర్ఆర్ఆర్ను కేంద్రం మంజూరు చేసింది. ఇచ్చిన హామీలను అమలు చేయాలన్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది. వాటిని పక్కన పెట్టి భాజపాపై ఆరోపణలు చేస్తున్నారు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com


## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1901: ఆంధ్ర రాష్ట్ర ప్రథమ శాసనసభ సభాపతి నల్లపాటి వెంకటరామయ్య జననం (మ. 1983).
- 1908: సాహిత్యవేత్త ఖండవల్లి లక్ష్మీరంజనం జననం (మ. 1986).
- 1947: అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ ప్రారంభం.
- 1968: భారతీయ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి కుంజరాణి దేవి జననం. (చిత్రంలో)
- 1969: భారతీయ రైల్వేలు రాజధాని ఎక్స్‌ప్రెస్ లను ప్రవేశపెట్టాయి. మొదటి రైలు ఢిల్లీ, కోల్‌కతాల మధ్య మొదలైంది.
- 1986: తెలుగు సినీ గాయకుడు ఎన్. సి. కారుణ్య జననం.



నల్లపాటి వెంకటరామయ్య



ఖండవల్లి లక్ష్మీరంజనం



అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ



కుంజరాణి దేవి


రాజధాని ఎక్స్‌ప్రెస్


ఎన్. సి. కారుణ్య

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# ధనశ్రీతో విడాకుల వార్తలు.. చాహల్ పోస్టు వైరల్

ధనశ్రీతో విడాకుల వార్తల వేళ చాహల్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.



భారత స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మకి సంబంధించి కొన్ని రోజులుగా విడాకుల వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో చాహల్ ఇన్స్టా వేదికగా పెట్టిన పోస్టు వైరల్గా మారింది. "నియంత్రించలేనంత గందరగోళ పరిస్థితుల్లో ఉన్నప్పుడు దయతో ఉండటమే అన్నింటికంటే మంచి పని" అని రాసుకొచ్చారు. చాహల్ - ధనశ్రీవర్మ 2020లో వివాహబంధంలోకి అడుగుపెట్టారు. సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉండే ఈ జంట.. గతంలో పెట్టిన పోస్టులు అభిమానులను గందరగోళానికి గురిచేశాయి. సామాజిక మాధ్యమాల్లో వీరిద్దరూ ఒకరినొకరు అన్ఫాలో చేసుకోవడం, ధనశ్రీ తన పేరు నుంచి 'చాహల్' పదాన్ని తొలగించడంతో విడాకులపై ఊహాగానాలు మొదలయ్యాయి. వీరి విడాకుల కేసుపై ముంబయిలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టులో ఇటీవల తుది విచారణ జరిగినట్లు తెలుస్తోంది. దీనికి చాహల్, ధనశ్రీ వ్యక్తిగతంగా హాజరయ్యారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు వీరికి 45 నిమిషాల పాటు కౌన్సెలింగ్ సెషన్ ఇచ్చినట్లు ఆ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయినా విడిపోవడానికే నిర్ణయించుకోవడంతో వీరికి విడాకులు మంజూరుచేస్తూ కోర్టు తీర్పు వెలువరించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. అప్పుడు.. ఒత్తిడి నుంచి విముక్తి లభించిందంటూ ధనశ్రీ స్పందించగా, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నానని నేను గుర్తించేలోపే భగవంతుడు బయటపడేశాడని చాహల్ స్పందించారు. తీర్పు వచ్చిందంటూ వెలువడిన కథనాలపై ధనశ్రీ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. విడాకుల కేసు కోర్టు పరిధిలో ఉందని చెప్పిన సంగతి తెలిసిందే. మరోవైపు రూ.60 కోట్ల భరణం గురించి అనేక ఊహాగానాలు వినిపించాయి. వీటిని ధనశ్రీ కుటుంబం తోసిపుచ్చిన సంగతి తెలిసిందే. "భరణం గురించి వస్తోన్న నిరాధారమైన కథనాలు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. అసలు అంత మొత్తాన్ని ఎవరూ అడగలేదు. అటువైపు వారు ఇస్తామని చెప్పలేదు. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదు. ధ్రువీకరించని సమాచారాన్ని ప్రచురించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమే. ఇలాంటి నిర్లక్ష్యపు చర్యలు హాని తలపెడతాయి. నిజానిజాలను ధ్రువీకరించుకోవాలని, ప్రతిఒక్కరి గోప్యతను గౌరవించాలని మీడియాను కోరుతున్నాం" అని ధనశ్రీ కుటుంబం నుంచి ప్రకటన వెలువడింది.

# ఆ విషయాన్ని రహస్యంగా ఉంచాలనుకున్నా: దీపికా పదుకొణె

బాలీవుడ్ నటి దీపికా పదుకొణె గతంలో మానసిక కుంగుబాటుతో ఇబ్బందిపడిన విషయం తెలిసిందే. దీనిని ఉద్దేశించి తాజాగా ఆమె మరోసారి మాట్లాడారు. కొన్ని విషయాలను రహస్యంగా ఉంచాలనుకున్నట్లు తెలిపారు.



మానసిక ఆరోగ్యంపై తరచూ అవగాహన కల్పిస్తుంటారు బాలీవుడ్ నటి దీపికా పదుకొణె. కెరీర్లో దూసుకెళ్తాన్న సమయంలో ఆమె మానసికంగా కుంగుబాటుకు గురై ఇబ్బందిపడిన విషయం తెలిసిందే. తాజాగా ఓ మ్యాగజైన్కు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆమె.. ఆనాటి రోజులను గుర్తుచేసుకున్నారు. ఏం జరుగుతుందో అర్థంకాక ఎంతో ఆవేదనకు గురైనట్లు చెప్పారు. ఆ సమయంలో కుటుంబసభ్యులు తనకెంతో అండగా నిలిచారని వివరించారు. "2014.. కెరీర్ పరంగా నేను మంచిస్థాయిలో ఉన్నాను. నాకు నచ్చిన సినిమాలు చేసుకుంటూ, నచ్చినవిధంగా జీవితాన్ని కొనసాగిస్తూ సంతోషంగా ఉన్నా. ప్రతి విషయంలోనూ ఆనందంగా ఉన్నా. ఆ సమయంలో ఓసారి తీవ్ర అలసటకు గురయ్యా. వృత్తిలో ఇవన్నీ భాగమే అనుకున్నా. ఓరోజు ఉదయం కళ్లు తిరిగిపడిపోయా. వెంటనే కావాల్సిన స్కానింగ్లు అన్నీ చేయించా. నా పరిస్థితి సాధారణంగా లేదని కొన్ని వారాలకు అర్థమైంది. ఏదో అయిపోతున్నట్లు భయపడేదాన్ని. అనవసరమైన వాటికి కూడా విపరీతంగా ఏడ్చేసేదాన్ని. నేను నాలా ఉండలేకపోయా. నన్ను చూడటానికి ఓసారి అమ్మ వాళ్లు ముంబయి వచ్చారు. థెరపిస్ట్ను కలవమని అమ్మ సూచించింది. అక్కడికి వెళ్లాక నేను మానసిక కుంగుబాటుకు లోనైనట్లు తెలిసింది" అని దీపిక చెప్పారు. థెరపిస్ట్ వద్దకు వెళ్లిన విషయాన్ని ఎవరితోనూ చెప్పకపోవడం గురించి మాట్లాడుతూ.. "ఆ సమయంలో నా పరిస్థితి గురించి ఎవరికీ చెప్పాలనుకోలేదు. రహస్యంగా ఉంచాలనుకున్నాం. అందుకే ఎవరికీ తెలియకుండా సీక్రెట్గా థెరపీ తీసుకొని వచ్చేదాన్ని. దానినుంచి కోలుకుంటున్న సమయంలో మానసిక ఆరోగ్యం గురించి అందరికీ అర్థమయ్యేలా చెప్పాలనుకున్నా. నాకు ఎదురైన సమస్యను అందరితోను పంచుకున్నా" అని తెలిపారు. ఈ క్రమంలోనే ఆమె 'లివ్ లాఫ్ లవ్' పేరుతో ఫౌండేషన్ ను ప్రారంభించారు. ఇది మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తుంటుంది. ఇక సినిమాల విషయానికి వస్తే.. గతేడాది విడుదలైన 'కల్కి 2898 ఏడీ', 'సింగం అగైన్' తర్వాత ఆమె కొత్త ప్రాజెక్టులు ప్రకటించలేదు. దువా (దీపికా పదుకొణె కుమార్తె) జన్మించిన తర్వాత ఆమె ఇటీవల పలు ఫ్యాషన్ షోస్లో పాల్గొన్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# దక్షిణాదిలో నటిగా కొనసాగడం చాలా కష్టం.. ఎందుకంటే: జ్యోతిక

దక్షిణాది పరిశ్రమలో నటిగా కొనసాగడం చాలా కష్టమని నటి జ్యోతిక అన్నారు. ఇక్కడ ఒంటరిగా పోరాటం చేయాల్సి ఉంటుందన్నారు.



భిన్నమైన కథలు ఎంచుకుంటూ నటిగా కొనసాగుతున్నారు జ్యోతిక. తాజాగా 'డబ్బా కార్టెల్' అనే వెబ్సరీస్లో పలకరించారు. ఈ సిరీస్ ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో జ్యోతిక మాట్లాడుతూ దక్షిణాది చిత్ర పరిశ్రమ గురించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అవి వైరల్ గా మారాయి. దక్షిణాది చిత్ర పరిశ్రమలో నటిగా కొనసాగాలంటే కష్టమని ఆమె అన్నారు. "నేను 28 ఏళ్ల వయసులోనే ఇద్దరు పిల్లలకు తల్లినయ్యాను. ఆ తర్వాత కూడా భిన్నమైన పాత్రలు చేస్తూ వరుస సినిమాల్లో నటిస్తున్నా. కానీ.. ఏ స్టార్ హీరో సరసన వర్క్ చేసే అవకాశం రాలేదు. కొత్త దర్శకులతో వర్క్ చేయడం చాలా పెద్ద సవాలు. ఆ రోజుల్లో కె. బాలచందర్ లాంటి అనుభవజ్ఞులైన దర్శకులు, పెద్ద నిర్మాతలు మహిళల కోసం సినిమాలు తీసేవారు. ఈ రోజుల్లో అలా ఎవరూ తీయడం లేదు. అగ్ర హీరోలతో సినిమాలు తీసేవారు మాత్రమే ఉన్నారు. మహిళా పాధాన్య చిత్రాలు రావడం పూర్తిగా తగ్గిపోయింది. దానికి బడ్జెట్ ఒక కారణమైతే.. వయసు మరొకటి. మహిళల కోసం గొప్ప కథలు రాసేవారు తగ్గిపోయారు. దక్షిణాదిలో నటిగా కొనసాగడం చాలా కష్టం. ఎందుకంటే ఇక్కడ ఒంటరిగా పోరాటం చేయాల్సివస్తుంది. 1997లో 'డోలీ సజాకే రఖ్నా' సినిమాతో జ్యోతిక ఇండస్ట్రీలోకి వచ్చారు. 2003లో వచ్చిన ఠాగూర్తో తెలుగు పరిశ్రమకు పరిచయమయ్యారు. 2006లో నటుడు సూర్యను వివాహం చేసుకున్నారు. వీరిద్దరూ కలిసి ఏడు సినిమాల్లో నటించారు.

## అందం

# కళ్ల చుట్టూ డార్క్ సర్కిల్స్‌తో చూడ్డానికే ఇబ్బందిగా మారాయా, కొన్ని పదార్థాలతో కాసేపు మసాజ్ చేస్తే సమస్య మాయం

కంటిచుట్టూ నల్లని వలయాలు రావడానికి చాలానే కారణాలు ఉంటాయి. అయితే, ఇవి రావడం వల్ల చూడ్డానికి అంతగా బాగోవు. వీటిని తగ్గించేందుకు ఎలాంటి టిప్స్ హెల్ప్ చేస్తాయో తెలుసుకోండి.

నీరసం, స్ట్రెస్, పెరిగిన వయసు, జెనెటిక్స్ ఇలా చాలా కారణాల వల్ల కంటి చుట్టూ నల్లని వలయాలు వస్తాయి. ఇవి అంత ప్రమాదకరం కానప్పటికీ చూడ్డానికి మాత్రం కాస్తా ఇబ్బందిగానే కనిపిస్తాయి. ఈ సమస్యని తగ్గించేందుకు చాలా రకాల ట్రీట్‌మెంట్స్ ఉన్నాయి. అందులో కొన్ని ఇంటి చిట్కాలు కూడా. ఈ ఇంటి చిట్కాల కారణంగా డార్క్ సర్కిల్స్ కాస్తా లైటెన్ అవుతాయి. మరి ఆ టిప్స్ ఏంటో తెలుసుకోండి.



### రోజ్ వాటర్



రోజ్ వాటర్ కూడా నల్లని వలయాలని దూరం చేసేందుకు హెల్ప్ చేస్తుంది. ఇందులో విటమిన్ ఎ, సిలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కళ్ల కింద నల్లదనాన్ని తగ్గించేందుకు హెల్ప్ చేస్తుంది. దీనికోసం రోజ్‌వాటర్‌లో దూదిని ముంచి కళ్లపై ఉంచి కాసేపు అలానే ఉంచండి. తర్వాత కాటన్ తీసేయండి. కానీ, కళ్లు కడగకూడదు. రోజూ ఇలా చేస్తే మంచి మంచి రిజల్ట్ ఉంటుంది.

### దోస, నిమ్మరసం



నిమ్మరసంలో మంచి బ్లీచింగ్ గుణాలు ఉంటాయి. దీనిని అప్లై చేయడం వల్ల కూడా సమస్య తగ్గుతుంది. అయితే, దీనిని నేరుగా రాయొద్దు. అందులో కొద్దిగా దోస రసం, చిటికెడు పసుపు కలిపి రాయండి. నిమ్మరసం మరీ ఎక్కువగా వాడకూడదని గుర్తుంచుకోండి.

### విటమిన్ ఇ ఆయిల్



విటమిన్ ఇ అనేది మంచి పోషకం. దీనిని మనం బ్యూటీ ప్రోడక్ట్స్‌లో వాడతాం. విటమిన్ ఇ ఆయిల్‌ని వాడడం వల్ల సమస్య తగ్గుతుంది. అయితే, నేరుగా రాయొద్దు. ఇందులో కొద్దిగా కొబ్బరినూనె, ఆలివ్ నూనెల్ని కలిపి ఆ తర్వాత ఆ నూనెల్ని నిదానంగా వేళ్లతో మసాజ్ చేయండి.

### మంచి నిద్ర



నిద్రలేకపోవడం వల్ల మీ కళ్ల కింద ఉబ్బరం, నల్లని వలయాలు ఏర్పడతాయి. కాబట్టి, రోజూ రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల పాటు మంచి నిద్ర ఉండేలా చూసుకోండి. నిద్రకి ముందు ఆల్కహాల్ తీసుకోవద్దు. దీంతో కూడా నిద్రసమస్యలొచ్చి డార్క్ సర్కిల్స్ ఏర్పడతాయి.

### అలర్జీలు తగ్గించుకోండి



చాలా మంది సీజనల్‌గా చాలా అలర్జీలు వస్తుంటాయి. దీని వల్ల కూడా కళ్ల కింద నల్లని వలయాలు ఏర్పడతాయి. ముక్కు దిబ్బడని ప్రేరేపించే అలర్జీలు ఉంటే తుమ్ము, ముక్కు కారడం వంటి లక్షణాలు తగ్గించేందుకు ట్రై చేయండి. దీంతో కళ్లు ఎర్రబడడం, వాపు ఉంటాయి. వీటన్నింటిని తగ్గిస్తే సమస్య దూరమవుతుంది.

### శనగపిండి



నగపిండి చర్మ సమస్యల్ని దూరం చేయడంలో బాగా పనిచేస్తుంది. ఓ స్పూన్ శనగపిండిలో కొద్దిగా పసుపు, మరికాస్తా టమాట రసం వేసి బాగా పేస్టులా చేయండి. దీనిని కళ్ల చుట్టూ అప్లై చేయండి. ఆరిన తర్వాత క్లీన్ చేయండి. రెగ్యులర్‌గా చేస్తే సమస్య చాలా వరకూ తగ్గుతుంది.



**గమనిక:** నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.